క్లుప్తంగా

చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం తన ఛాంబర్‌లో మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. రూ.90వేల విలువైన చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి వాడలో శనివారం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్, సిబ్బంది శోభ, రజిత, విజయ, గఫూర్, ఇస్సాక్, వేణు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల పద్మశాలీ భవన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని వైద్యాధికారిని జాహ్నవి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మందులు అందజేశారు. క్షయపై జిల్లా కోఆర్డినేటర్ సురేందర్‌తో కలిసి అవగాహన కల్పించారు. జిల్లా హైపటైస్ ఇన్‌చార్జి మధు, దిశ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ, సూపర్‌వైజర్ సురేఖ, టీబీ సూపర్‌వైజర్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఐసీటీసీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఇళ్ల పట్టాలందించాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: శ్రీరాంపూర్, నస్పూర్ పరిధిలోని వివిధ కాలనీలు, సింగరేణి ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు అందించాలని నస్పూర్ పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో పి.చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అకూ సుబ్బయ్య, ఈసంపెల్లి ప్రభాకర్, పవన్‌కుమార్, వంగ తిరుపతి, రాజేంద్రప్రాణి, అహ్మద్, సంపత్, సత్తయ్య, తిరుపతి, రవిగౌడ్, మోహన్, నరేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: జిల్లాలోని సికిల్ సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు శనివారం రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహాస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు నారాయణ మూర్తి, దామోదర్, రవీందర్, సుమన్, శ్యామల, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కొట్టె శ్రీనివాస్ తెలిపారు. కొమ్మెర ఫీడర్ పరిధి లోని కొమ్మెర, ఆస్నాద, దుగ్నెపల్లి, పొక్కూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నస్పూర్: మున్సిపల్ కార్పొరేషన్ నస్పూర్ పరిధి సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంచందర్ తెలిపారు. తీగల్‌పహడ్, సీతారాంపల్లి, హౌజ్‌బోర్డు, తాళ్లపల్లి ఆర్‌అండ్‌కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, అభినవకాలనీ, పటేల్ కాలనీ, శ్రీపాదసిటీ, రెడ్డి కాలనీ, ప్రగతినగర్, రీటర్‌మెంట్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమల మందు పిచికారీ

మంచిర్యాలటౌన్: దోమల నివారణ కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టళ్లలో దోమల మందు పిచికారీ చేసే కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. నగరంలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలోని గదుల్లో దోమల మందును మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించి, దోమలు వృద్ధి చెందకుండా చూడాలని కోరారు.

ఘనంగా పొలాల అమావాస్య



తాండూర్: అచ్చలాపూర్‌లో బసవన్నలకు పూజలు

తాండూర్/భీమారం/చెన్నూర్/వేమనపల్లి: పొలాల అమావాస్య పండుగను గ్రామీణులు ఘనంగా నిర్వహించుకున్నారు. వ్యవసాయంలో తమకు నిత్యం వెన్నంటి ఉండే పశువులను అందంగా ముస్తాబు చేసి వాటికి నైవేద్యాలు సమర్పించారు. అందంగా అలంకరించిన బసవన్నలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రావణమాసంలో చివరి రోజైన శనివారం పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని కొందరు ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భీమారం: అలంకరించిన బసవన్నలతో రైతు



వేమనపల్లి: బసవన్నలకు మొక్కుతున్న రైతు

రోడ్డుపై గుంతలు.. ప్రజల తిప్పలు!

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



రోడ్డుకిరువైపుల చెట్ల కొమ్మలు



గుంతలు పడిన వెంకటాపూర్ రోడ్డు

జన్నారం: మండలంలోని మురిమడుగు నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే రోడ్డు సుమారుగా నాలుగు కిలోమీటర్లు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు బురద ఏర్పడి, గుంతల్లో నీరు నిలిచి ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. చెట్ల కొమ్మలు అడ్డుగా రావడంతో ముందు వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామాలకు సొంత వాహనాలు తప్పా మిగితా వాహనాలు నడపడం లేదని, ఎమెర్జెన్సీకి అంబులెన్స్ రావడానికి నానా పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏళ్ల గడుస్తున్నా పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిత్యం ప్రజలు తమ అవసరాలకు, విద్యార్థులు పాఠశాలలకు రాకపోకలు సాగించే ఈ రోడ్డుకు మరమ్మతు చేయించి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది అవుతుంది



నిత్యం సొంత పనుల పై మా గ్రామం నుంచి జన్నారం, కలమడుగు, మురిమడుగు గ్రామాలకు వెలుతుంటాం. రోడ్డు గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. పిల్లలను ఉన్నత చదువుల కోసం మండల కేంద్రానికి పంపాలంటే వాహనాలు రావడం లేదు. అధికారులు దృష్టి సారించి రోడ్డు నిరించాలి.

– పోతురాజుల కాంతరావు, మల్లాపూర్

ఆటోలు నడుపలేక పోతున్నరు..



ఏదైనా అవసరం ఏర్పడి ఆటో కావాలనుకుంటే రోడ్డు బాగోలేదు రామంటున్నారు. వచ్చినా కిరాయి ఎక్కువగా తీసుకుంటున్నారు. ఏళ్ల నుంచి ఇదే ఇబ్బంది పడుతున్నాం. ఎవ్వరు పట్టించుకుంటలేరు. ఎమ్మెల్యే మా ఇబ్బందులు గుర్తించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– బోడకుంటి రాజేశం, మాజీ ఉప సర్పంచ్

ఎమర్జెన్సీ పనులకు ఇబ్బంది



అనారోగ్యం బారినపడి ఏదైనా ఎమర్జెన్సీ పనిపడితే వాహనాలు దొరకడం లేదు. ఊర్లో ఉన్న వాహనాలు ఒక్కోసారి అందుబాటులో ఉండకపోతే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. అంబులెన్స్ రావాలన్నా నానా పాట్లు పడాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– భూమయ్య, వెంకటాపూర్

ప్రభావిత గ్రామాల ప్రజల సౌకర్యార్థం వైద్యశిబిరాలు

- ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ప్రభావిత గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి తెలిపారు. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో శనివారం పవర్‌ప్లాంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రవీందర్ ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సీనియర్ పర్సనల్ అధికారి ఠాకూర్‌మోహన్‌సింగ్, ఎస్‌వోటు ఈడీ వెంకటయ్య, సీనియర్ ఇన్స్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఈడీ చిరంజీవి

ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని పూజలు

దండేపల్లి/మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఇటీవల శస్త్ర చికిత్స చేసుకుని మంచిర్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని మంచిర్యాల పట్టణ, దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నగరంలోని విశ్వనాథ ఆలయంలో, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, వాసవి మాత, శివాలయాల్లో అభిషేకం చేసి ఎమ్మెల్యేకు దేవుని ఆశీస్సులు ఉండాలని కోరారు. పూజల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ కౌన్సిలర్లు మామిడిశెట్టి వసుంధర, రామగిరి బానేశ్, వేములపల్లి సంజీవ్, మాదంశెట్టి సత్యనారాయణ, జోగుల సదానందం, బొలిశెట్టి కిషన్, మాజీద్, గాండ్ల సత్తమ్మ, చింతకింది మల్లయ్య, దోమల రమేశ్, ఒడ్డె రాజమౌళి, పెంట రజిత, అర్కల హేమలత, తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ ఆలయంలో పూజలు

సంక్షిప్త వార్తలు

• విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

దండేపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ డిమాండ్ చేశారు. దండేపల్లి జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యవేక్షణ లేక చాలా చోట్ల ఫుడ్ పాయిజన్ కేసులు జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలన్నారు. నాయకులు శరత్, మహేష్, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

• ఘనంగా చండీయాగం

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ రైల్వే స్టేషన్ రోడ్డులో గల శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, నరసింహస్వామి ఆలయాల ఆవరణలో నెల రోజులుగా శ్రీచక్రసహిత దుర్గామాత అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, లలితా పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చండీయాగం చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కుషకుమార్, కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• ఓటు చోరీపై అవగాహన

జన్నారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఓటు చోరీ పై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహేల్‌షా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఫసిఉల్లా, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

• నిజాయతీ చాటుకున్న యువకుడు

చెన్నూర్: పట్టణానికి చెందిన ఒక యువకుడు దొరికిన ఐఫోన్‌ను అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. వివారాల్లోకెళ్తే.. రంజిత్ ఇంటి నుంచి బయటికి వస్తున్న క్రమంలో రూ.1లక్ష విలువైన ఐఫోన్ దొరికింది. వెంటనే ఆయన పోలీసుస్టేషన్‌లో సీఐ దేవేందర్‌రావుకు అందజేయగా, సీఐ రంజిత్‌ను అభినందించారు. ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

• సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

చెన్నూర్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సతన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు నాగరాజు, తిరుపతి, సాంబయ్య, ప్రవీణ్, సమ్మయ్య, సురేశ్ పాల్గొన్నారు.

‘సుధాకర్‌రెడ్డి మరణం తీరని లోటు’


పాతమంచిర్యాల/నస్పూర్/బెల్లంపల్లిరూరల్: ప్రజా నాయకుడు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రం, బెల్లంపల్లి సీపీఐ పార్టీ కార్యాలయాల్లో, నస్పూర్‌లోని నర్సయ్య భవనంలో శనివారం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలిందర్ అలీఖాన్, సుదర్శన్ లింగం రవి, బెల్లంపల్లిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, పట్టణ, మండల కార్యదర్శులు ఆడెపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డీఆర్ శ్రీధర్, నస్పూర్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శి లింగం రవి తదితరులు పాల్గొన్నారు.



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాల, బీసీ బాలికల వసతి భవనం నిర్మించాలి


మంచిర్యాలఅర్బన్: శిథిలావస్థకు చేరిన మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. ప్రస్తుతం బీసీ బాలికల వసతిఅద్దె భవనంలో నిర్వహిస్తుండటం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కళాశాలలకు దూరంగా వసతిగృహం ఏర్పాటు చేయటం వల్ల దూరభారంగా మారుతుందన్నారు. మహిళ డిగ్రీ కళాశాలకు కేటాయించిన భవనం పనులు పూర్తి చేసి బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాధ్యులు మణిచరణ్, నగేశ్, వంశీకృష్ణ, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.



యూఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు, విద్యార్థుల నిరసన

విలీన గ్రామాల కార్మికులకు వేతనాలు పెంచాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం అయిన గ్రామాల్లోని కార్మికుల వేతనాలు రూ.17,600 చెల్లించాలని కోరుతూ విలీన గ్రామాల కార్మికులు శనివారం అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాజీపూర్ మండలంలోని 8 గ్రామాల కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి, 60ఏళ్లు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు సత్యం, కోకిల శ్రీనివాస్, ఆవునూరి గోపాల్, దాసరి సుమన్, చిప్పకుర్తి అశోక్, ఆత్మకూరు మల్లేశ్, స్వామి పాల్గొన్నారు.



రాజ మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు ప్రారంభం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని శనివారం ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థుల ముఖ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలని నిబంధనలు రావడంతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్‌గౌడ్, అరవింద్, శ్రీనివాస్‌రావు, బాలాజీ, చిన్నయ్య, హేమచందర్, మహేందర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ‘పల్లెబాట’

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరులో విద్యుత్ శాఖ అధికారులు పల్లెబాట నిర్వహించారు. విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు, పొదుపు గురించి కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కొట్టె శ్రీనివాస్ విద్యుత్ వినియోగదారులకు తెలియజేశారు. నాణ్యమైన వైర్లు, స్విచ్చులు వాడాలన్నారు. ప్రతీ ఇంటికి ఎర్తింగ్ చేసుకోవాలని, ఫ్రిజ్‌లు, కూలర్లకు ఎర్తింగ్ చేస్తే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. నాణ్యమైన సర్వీస్ వైరు, డీపీ మెయిన్ స్విచ్ ఫ్యూజ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ లైన్లకు కొండీలు వేయకూడదని సూచించారు.

■ బొగ్గుబాయి వార్తలు

మెరుగైన వైద్యం అందించాలి



ప్రశంసాపత్రం ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: సింగరేణి కంపెనీ ఆసుపత్రుల్లో కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని ఏరియా జీఎం దేవేందర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఏరియాలోని కేకే డిస్పెన్సరీని శనివారం మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. వార్డులు పరిశీలించారు. ఏరియాలో కార్మికుల వైద్య సమాచారంతో కూడిన 40వేల ఓ ఫార్మ్‌లను హాస్పిటల్ సిస్టమ్‌లోకి అప్‌లోడ్ చేసిన జనరల్ అసిస్టెంట్ నడిమెంట్ల సాహిత్య, స్టాఫ్‌నర్స్ నక్క సుష్మ(కాంట్రాక్ట్)లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన వెంట డీజీఎం(సివిల్) రాములు, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డాక్టర్ శైలజ, డాక్టర్ శ్రీజ, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

లాభాల వాటా 35శాతం చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు 2024–25 ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, వాటిలో 35శాతం ఉద్యోగులకు పంపిణీ చేయాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ, సంస్థ వాస్తవ లాభాలు వెల్లడించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, రాజిరెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, తామస్, ప్రభాకర్, గట్టయ్య, సంతోష్ ఉన్నారు.

వారసంతలో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలి

తాండూర్: కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శనివారం సంతలో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలని మండల బీజేపీ నాయకులు కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు రామగొని మహీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు వి ఘ్నేష్, పుట్ట కుమార్, ఉపాధ్యక్షుడు రేవెల్లి శ్రీ నివాస్, సీనియర్ నాయకులు దుర్గాచరణ్, అ రికెల శంకర్, శ్రీకాంత్, లింగమూర్తి పాల్గొన్నా రు.



ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని చెప్పి ఇప్పటికీ అమలు చేయడం లేదని, బీసీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉత్తరాల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు న్యాయవాది కర్రె లచ్చన్న, నాయకులు తులా మధుసూదన్‌రావు, గజెల్లి వెంకన్న, ఆరేందుల రాజేశం, భిక్షపతి, రాజన్న, రాజేష్, రాజేశం పాల్గొన్నారు.



ఉత్తరాలు పోస్టు చేస్తున్న నాయకులు